క్లుప్తంగా

రేపు జాతీయ లోక్ అదాలత్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 9న మిర్యాలగూడ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల ప్రమాద కేసులు, బ్యాంకు రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూమి వివాదాలు, వినియోగదారుల కేసులు, ఇతర సివిల్ దావాలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాగార్జునసాగర్ : ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా కేసులను సత్వర పరిష్కారం కోసం ఈ సెప్టెంబర్9వ తేదీ వరకు పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

హారికకు పరామర్శ

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలో ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన హారిక(5) నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈవిషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి గురువారం నల్లగొండ ఆస్పత్రికి వెళ్లి హారికను పరామర్శించారు. అనంతరం వారి తల్లిదండ్రులకు రూ.5వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మందా కిశోర్ తదితరులు ఉన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

డిండి : మండల పరిధిలోని దాసరినెమలిపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి ఆకు తోటపల్లి నిజాంనగర్ గ్రామాల మీదుగా బీటీరోడ్డు ఏర్పాటుకు రూ. 8.40కోట్ల నిధులు ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మంజూరు చేయించడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఉప్పుగంటి ప్రశాంత్‌రావు, సర్పంచ్ నరేష్, సూరి, అంజల్‌రావు, అబ్దుల్లా, నర్సింహ, వెంకటయ్య, సైదులు తదితరులున్నారు.

రాజకీయ ఆరోపణలు మాత్రమే చేశా : ఎంపీపీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తాను వ్యక్తిగతంగా ఎవరిపై కూడా ఆరోపణలు చేయలేదని రాజకీయ ఆరోపణలు మాత్రమే చేశానని ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రంగుండ్లలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే కుటుంబంలో చిన్న చిన్న మనస్పర్థలు రావడం సహజమని దానిని కొంతమంది ఆసరాగా చేసుకొని తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తనపై తన సోదరుడు సోషల్‌మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలు దురదృష్టకరమన్నారు.

ఆమోదయోగ్యమైన స్థలంలోనే నిర్మించాలి



మాట్లాడుతున్న జంకుతండా వాసులు

మిర్యాలగూడ టౌన్ : గ్రామ ప్రజలకు ఆమోదయోగ్యమైన స్థలంలోనే పంచాయతీ భవనాన్ని నిర్మించాలని మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామ వార్డు సభ్యులు కామిశెట్టి శ్రీనివాస్, రమేష్ అన్నారు. గురువారం ఆ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం విషయంపై స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును కలిసిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఊరి చివరిలో ఎక్కడో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆ స్థలం ఇచ్చేందుకు ధనవాత్ బాల కుటుంబం ముందుకువచ్చిందని, అయినా అక్కడ పంచాయతీ భవన నిర్మాణం విషయంలో ఉన్న అభ్యంతరాలు ఏమిటో గ్రామ ప్రజలకు సర్పంచ్ వివరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జంకుతండా గ్రామస్తులు నగేష్, ఇబ్రహీం, సోమయ్య, శ్రీను, మల్లేష్, తిరుపతినాయక్, బిమ్లానాయక్, ఉన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాలియా : ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై సీఎం కేసీఆర్ ఒత్తిడి తెచ్చేలా చూడాలని ఎమ్మెల్సీ కోటిరెడ్డికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడుపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుముల మండల ఇన్‌చార్జ్ గార్లపాటి ప్రసాద్ మాదిగ, కోట రాజు మాదిగ, మడుపు సూర్య మాదిగ, పడిశల నాగరాజు మాదిగ, కోట ప్రసాద్, మడుపు సూరయ్య, అఖిల్, విజయ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మిర్యాలగూడ టౌన్ : పండుగలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని నాగార్జుననగర్‌లోని యాదవ భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, నోముల భగత్‌కుమార్ యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, యువ మోర్చా జాతీయ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు యాదన్న, పట్టణ యాదవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, సర్నాల వెంకయ్య, గుడిపాటి కోటయ్య యాదవ్, అశోక్, బిక్షం, మహేష్, సాయి, ఎర్రయ్య, దారం మల్లేష్, కాశయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, మురళి, కిశోర్, వెంకన్న, రమాదేవి, వెంకట్, జంగా లక్ష్మణ్ యాదవ్ తదితరులున్నారు. పట్టణంలోని అశోక్‌నగర్ లోటాస్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు శ్రీకృష్ణుడిగా, గోపికలుగా సాంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులు ఉట్టికొట్టారు. ఈ కార్యక్రమంలో లోటాస్ స్కూల్ చైర్మన్ వరప్రసాద్, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రైమరి స్కూల్ ఇంచార్జీ రజనీ, చిత్రకారుడు విజయ్‌కుమార్ ఉన్నారు.

మిర్యాలగూడ : స్థానిక యాదవసంఘం భవనంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం మిర్యాలగూడ పురవీధుల్లో యాదవులు సాంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, నియోజకవర్గ యాదవ సంఘం నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, పగిడి రామలింగయ్యయాదవ్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, జంగా లక్ష్మణ్‌యాదవ్, రాజ్‌కుమార్, ఎర్రయ్య, పసుల కాశయ్య, సంకబుడ్డి సత్యం పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



పెద్ద దేవులపల్లి : శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి, బాబుసాయి పేట గ్రామంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించి ఉట్లు కొట్టారు. పెద్దదేవుల పల్లి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో 500మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు, సాగర్ నియోజకవర్గ యాదవ యువజన సంఘం అధ్యక్షుడు జానపాటి సతీష్ యాదవ్, నగేష్ యాదవ్, ప్రసాద్, గుండెబోయిన రామయ్య, కంచుగంట్ల వెంకన్న, శ్రీకాంత్, నాగరాజు, కోటేష్, మధు, అంజనేయులు, వినోద్, లింగయ్య పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని పులిచర్ల, తుంగతుర్తి, వెల్మగూడెం, గర్నెకుంట, ఊట్లపల్లి, లింగంపల్లి తదితర గ్రామాల్లో యాదవ కులస్తులు కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో యువకులు ఉట్లను కొట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మెండె విష్ణుప్రియాసైదులు, దాసరి సైదమ్మనాగయ్య, రావుల శ్రీను, హాలియమ్మ రామాంజీ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పట్టణ ప్రధాన రహదారి, పురవీధుల గుండా నిర్వహించిన శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు కార్యక్రమంలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, యుగంధర్‌రెడ్డి, నాయిని తిరుమల్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, బొడిగె సాంభశివగౌడ్, బూడిద మల్లేశ్‌యాదవ్, నీలా లక్ష్మయ్య, రామలింగం, బోడ యాదగిరి, బోడ అశోక్, పోతురాజు సత్తయ్య పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : నందికొండలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హిల్‌కాలనీ,పైలాన్‌కాలనీలలోని ఆలయాల్లో ఉట్లు కొట్టారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కృష్ణుడి, గోపికల అలంకరణలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో యాదవులు ఉట్టికొట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాగం శ్రవణ్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ పుట్లూరి రాజశేఖర్‌రెడ్డి, యాదవ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నడ్డి బాలరాజు యాదవ్, దేవాలయ చైర్మన్ నాగేండ్ల వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పగడాల సైదులు యాదవ్, సత్యనారాయణ, అంజిరెడ్డి,మల్లయ్య పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో యాదవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నపిల్లల కృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి. కొప్పోలు రామాలయం ఎదుట ఉట్లు కొట్టే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.



తిరుమలగిరి : శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు



గుర్రంపోడు : కొప్పోలు రామాలయంలో..



మిర్యాలగూడ టౌన్ : శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న బడుగుల లింగయ్య యాదవ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏపల్లి, చందంపేట మండలాలకు చెందిన 62మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల వివాహానికి రూ.1లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, నర్సింహ, చందు, శ్రీనివాస్‌యాదవ్, కిషన్, తదితరులున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

చింతపల్లి : దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ గట్టుపతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నట్వ గిరిధర్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అమరుల ఆశయాలు సాధించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : అమరుల ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిల్లాపురం గ్రామంలో నిర్వహించిన కంచర్ల కోటిరెడ్డి రెండో వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఎం నిర్మాణం కోసం కోటిరెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అమరుల స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రాజకీయ జోక్యంతో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పేదలకు అందే పథకాలలో రాజకీయ జోక్యాన్ని నివారించకుంటే ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, కృపాకర్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాబునాయక్, నాగేశ్వర్‌రావు, ఆశీర్వాదం, వేణు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

హాలియా : ఈనెల 19 నుంచి 21 వరకు తమిళనాడులో నిర్వహించే ఆదివాసీ సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ పిలుపు నిచ్చారు. గురువారం హాలియా పట్టణంలోని విశ్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా బృందాకారత్ చైర్మన్ డాక్టర్ బాబురావు, కన్వీనర్‌గా త్రిపుర మాజీ మంత్రి జితిన్ చౌదరితో పాటు దేశవ్యాప్తంగా 450 మంది ఆదివాసి ఉద్యమ నాయకులు, ప్రతినిధులు హాజరవుతున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ నరేష్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి కొర్ర రాజు నాయక్, శ్రీను నాయక్, భూక్య, గణేష్ నాయక్, రమావత్ శంకర్ నాయక్ ఉన్నారు.

రావి నారాయణరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దేవరకొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి 33వ వర్ధంతిని దేవరకొండలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూం బుచ్చిరెడ్డి, వెంకటయ్య, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు ఉన్నారు.

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

మాడుగులపల్లి : బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎన్ఆర్ఐ కొంపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు 'మేరీ మాటీ- మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గార్లకుంటపాలెం, ధర్మపురం గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమరుల స్థూపం నిర్మాణానికి మట్టిని సేకరించి మాట్లాడారు. దేశంకోసం ప్రాణాలర్పించిన అమరుల కోసం ఢిల్లీలో స్మారక స్థూపం నిర్మించేందుకు ప్రతి ఇంటి నుంచి పిడికెడు మట్టిని సేకరిస్తున్నట్లు తెలిపారు. పౌరులందరికీ దేశంపై ప్రేమ, గౌరవం ఉండాలన్న భావనతో ప్రధాని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిడమనూరు మండల కన్వీనర్ ఉయ్యాల నరసింహగౌడ్, నాయకులు పగిళ్ల రామ్మూర్తి, మొగుళ్ల జానకి రాములు, వీరమల్ల భిక్షం, నల్లగంతుల మహేష్, మసిముక్కు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

నేడు బీజేపీ విస్తృత స్థాయి సమావేశం



సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

దేవరకొండ : బీజేపీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని పట్టణ కేంద్రంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం సమావేశం ఏర్పాట్లను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు కర్నాటి సురేష్, కేతావత్ లాలునాయక్, కళ్యాణ్‌నాయక్, ఏటి కృష్ణ, నరసింహారావు, గుండాల అంజయ్య, సైదులు, సాగర్, భాస్కర్ ఉన్నారు.

కొండమల్లేపల్లి : దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్న బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పేర్ల జితేందర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా 'బీసీల సింహగర్జన'

మిర్యాలగూడ టౌన్ : సామాజిక న్యాయం, సబ్బండ వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈనెల 10వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీసీల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని బాలుర బీసీ వసతి గృహంలో సింహగర్జన సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు శివ, వంశీ, బాలాజీ, సందీప్, శివ, విష్ణు, గణేష్, శ్రవణ్, నవీన్, సిద్ధు, గోపి, వెంకటేష్, పరమేష్, రవితేజ, నాగార్జున, కృష్ణ, సంజీవ్, సతీష్ ఉన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండ ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య నాయకులు గురువారం పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిగ్రీ చదువుతన్న మనీషా, శివానీలు ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, సైదమ్మ, వెంకన్న, అజ్గర్‌అలీ, సత్తార్, రాములు, జానయ్య పాల్గొన్నారు.

బీఎల్ఆర్‌పై అసత్య ప్రచారం తగదు

మిర్యాలగూడ : అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) బీజేపీలోకి వెళ్తున్నాడని అసత్య ప్రచారం చేస్తున్నారని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధనావత్ సిద్ధు నాయక్ అన్నారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కోవర్టులు బీఎల్ఆర్ బీజేపీలోకి వెళ్తున్నారని అబద్దపు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు వాంకుడోతు రవితేజ, గాలం వెంకన్నయాదవ్, సదానందం, కోటిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధునాయక్

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

దేవరకొండ : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని అఖిల భారత ఆదివాసి కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ నేనావత్ కిషన్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్ర సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సాధారణ ఎన్నికల్లో దేవరకొండ ఖిలాపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, విజయ్, శ్రీధర్‌నాయక్, కొర్ర నాగరాజు,వడ్త్య చైతన్య, మనోహర్‌గౌడ్, జైపాల్‌నాయక్, ఖాజా, తదితరులున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లు

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల మోసం చేస్తున్నాయని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆరోపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలోని ఐబీ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మొత్తాన్ని ఏకం చేయాలన్న నినాదంతో 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాల నర్సింహ్మారెడ్డి, ఎంఏ సిరాజ్‌ఖాన్, పవన్‌కుమార్, ఏవిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాజేష్‌రెడ్డి, మోహన్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఎండీ యూనుస్, వెంకటయ్యగౌడ్, కుమార్, కొర్ర రాంసింగ్, ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.



దేవరకొండ : ర్యాలీలో పాల్గొన్న కిషన్ నాయక్, తదితరులు



మిర్యాలగూడ : ర్యాలీలో పాల్గొన్న బీఎల్ఆర్, తదితర నాయకులు

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మిర్యాలగూడ : కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏఐసీసీ పిలుపుమేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 7న రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచి ప్రజల కష్టాలను తెలుసుకుని కొత్త అధ్యాయాన్ని రాహుల్ గాంధీ సృష్టించాడన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిరుమర్తి లింగయ్య, పగిడి రామలింగయ్యయాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిలి శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీతకృపయ్య, నాయకులు దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, జాని, బెజ్జం సాయి, ఇజ్రాయిల్, బంటు కిరణ్, అంజిరెడ్డి, అజహర్‌సిద్ధునాయక్, పాతూరి ప్రసాద్, గోదాల జానకిరాంరెడ్డి, పాల్గొన్నారు.

అక్టోబర్ 1న బహుజన సింహగర్జన సభ

పెద్దవూర : అక్టోబర్ 1వ తేదీన హాలియాలో నిర్వహించనున్న బహుజన సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమళ్ల వెంకటేశ్ కోరారు. గురువారం మండలంలోని రామన్నగూడెం తండా, ఏనేమీదితండా, చలకుర్తి, బెట్టెలతండా, కుంకుడుచెట్టుతండా, పూల్యాతండా, మల్లెవానికుంటతండా, రామ్మూర్తికాలనీలలో సభ విజయవంతానికి సైకిల్‌యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రమేష్ రాథోడ్, ముత్యాలు, సత్యనారాయణ, రమేష్ ఉన్నారు.

ఉలేమా బహిరంగ సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : ముస్లిం, మైనార్టీల సమస్యల పరిష్కారానికి జమియత్ ఉలేమా ఆధ్వర్యంలో ఈనెల 10న నల్లగొండ క్లాక్ టవర్ వద్ద నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా ఖలీఖ్ అహ్మద్‌సాబిర్ కోరారు. గురువారం మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో 16శాతం జనాభా ఉన్న ముస్లింలకు రాజకీయ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 12శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలన్నారు. ధరణి పోర్టల్ ద్వారా వక్ఫ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని మిగిలి ఉన్న భూములను ముస్లింల సంక్షేమానికి, మసీద్, మదరసాలు, రాళ్లు కొట్టి జీవించే వారికి ఇవ్వాలన్నారు. దళితబంధు మాదిరిగా ముస్లిం బంధు పథకం అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ వలిఉల్లా, మౌలానా మహమ్మద్ మగ్దూం, ముఫ్తీ మహమ్మద్ రియాజ్, ఉమర్, హఫీజ్ మహమ్మద్, రఫీ, రఫిఖాన్ ఉన్నారు.

ఊరూరా ఘనంగా బోనాలు



మాడుగులపల్లి : చెరువుపల్లిలో ముత్యాలమ్మకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



వేములపల్లి : మొల్కపట్నంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

మాడుగులపల్లి : మండలంలోని మాడుగులపల్లి, చెరువుపల్లి, కల్వలపాలెం, దాచారం, కొత్తగూడెం గ్రామాల్లో బోనాల పండుగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. బోనాల పండుగలు కావడంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణ కనిపించింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు బెల్లి సాలమ్మ, బొర్రాజు సైదమ్మ, తూనం శోభ, గడ్డిమీది సైదులు, సింగం శివ, గ్రామ పెద్దలు జూలకంటి బుచ్చిరెడ్డి, సర్వయ్య, సాయులు, వెంకులు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామంలో గురువారం గ్రామ దేవతలకు మహిళలు బోనాలను డప్పులతో, శివసత్తుల నృత్యాల నడుమ ఎత్తుకోని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, మాజీ ఎంపీపీ నామిరెడ్డి రవీనా, పందుల సైదులు, జెర్రిపోతుల గిరిబాబు, బారి లింగయ్య, రాములు, పాండు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న శ్రీదేవి భూదేవి సమేతా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ కరపత్రాలను జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కల్యాణోత్సవానికి మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, లింగయ్య, నగేష్, శ్రీను, వెంకటయ్య పాల్గొన్నారు.



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శోభారాణి